సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 24 । ఏప్రిల్ । 2025



పదును తగ్గిన కొడవలి

ఒకప్పుడు వ్యవసాయంలో ప్రముఖ పాత్ర పోషించిన కొడవలి క్రమంగా తన బాధ్యతల నుంచి దూరమైపోతుంది. కొడవలి దాదాపు రైతుచేతికి దూరమైపోయింది. 4లో



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

క్షేత్రంలో శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. మే 11న స్వామివారి కల్యాణం, 12న రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 4లో



గ్యాస్ లీక్.. ఐదుగురికి అస్వస్థత

పాలకోడేరు మండలంలోని మోగల్లు వశిష్ట ఆక్వా మెరైన్ పరిశ్రమలో మంగళవారం రాత్రి అమ్మోనియా గ్యాస్ లీకై ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. 4లో

న్యూస్‌రీల్

సివిల్స్‌లో ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థినికి 11వ ర్యాంక్



నూజివీడు : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) ఒంగోలు క్యాంపస్‌లో 2016–22 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని సాయి శివాని యూపీఎస్సీ ఫలితాల్లో 11వ ర్యాంకు సాధించింది. గ్రామీణ నేపథ్యాన్ని అధిగమించి దేశంలో అత్యున్నత స్థాయిలో ర్యాంకు సాధించడం ఆమె కృషికి, పట్టుదలకు, అభ్యాసన పట్ల చూపిన నిబద్ధతకు నిదర్శనం. సివిల్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించడంతో ట్రిపుల్ ఐటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇన్‌చార్జి చాన్సలర్ ఆచార్య కొత్తా మధుమూర్తి, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్ కుమార్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఒంగోలు డైరెక్టర్ భాస్కర్ పటేల్ ఆమెకు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి నాటిక పోటీలు



జాతీయ స్థాయి నాటిక పోటీల ఏర్పాట్ల దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి నాటిక పోటీలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. నాటిక పోటీల కోసం గన్నాబత్తుల క్రీడా మైదానంలో ప్రత్యేంగా వేదిక ఏర్పాటుచేశారు. ఈ నాటిక పోటీల ప్రారంభం సందర్భంగా ప్రముఖ సినీనటుడు రావు రమేష్‌ను ఆత్మీయ చైతన్య పురస్కారంతో సత్కరించనున్నారు. పోటీలను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు, కలెక్టర్ నాగరాణి ప్రారంభిస్తారని పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ చెప్పారు. సినీ నటులు, రచయిత మిర్రోకు చుక్కన సత్యనారాయణరాజు రంగస్థల చైతన్య పురస్కారం, నటీమణి మణిబాలకు పెనుపోతుల శేషగిరిరావు రంగస్థల చైతన్య పురస్కారం అందించనున్నారు.

మాతా శిశు మరణాలపై నిర్లక్ష్యం తగదు



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లి మరణిస్తే ఆ కుటుంబం ఎంతో ఇబ్బందులకు గురవుతుందని, జిల్లాలో మాతా శిశు మరణాలు జరగకుండా వైద్యులు అత్యంత అప్రమత్తతతో చికిత్స అందజేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ అధ్యక్షతన మాతా శిశు మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్ర కీలకమైందని, తల్లి చనిపోతే పిల్లలు, కుటుంబ సభ్యులు ఎన్నో ఇబ్బందులు పడతారని, ఈ విషయాన్ని ప్రసూతి వైద్యులు గుర్తించుకోవాలన్నారు. 2024 – 25 సంవత్సరంలో జిల్లాలో 8 మంది తల్లులు, 88 శిశు మరణాలు సంభవించాయన్నారు. ఇలాంటి సంఘటనలు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ప్రైవేట్ నర్సింగ్ హోంలు వైద్యం అందించడంలో మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ జి.గీతా బాయి, కమిటీ సభ్యులు ఐసీడీఎస్ పీడీ బి.సుజాత రాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సూర్యనారాయణ, డీఐఓ డాక్టర్ దేవ సుధాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి మార్టేరు -పెనుగొండ రహదారి మూసివేత

పెనుమంట్ర:పెనుగొండ -మార్టేరు ప్రధాన రహదారిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 25 నుంచి జూన్ 10 తేదీ వరకు 45 రోజులపాటు రోడ్డును మూసివేస్తున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ ప్రసాద్ మంగళవారం తెలిపారు. పెనుమంట్ర మండలం నెగ్గిపూడి వద్ద బ్రాంచ్ కాలువకు వంతెన నిర్మాణం పెనుగొండలో పెద్ద వంతెనకు మరమ్మతుల చేపట్టిన నేపథ్యంలో ఈ రూట్ లో వాహనాలు రాకపోకలను మళ్లిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం, రాజమండ్రి, రావులపాలెం వెళ్లే వాహనాలను మార్టేరు నుంచి ఆచంట సిద్ధాంతం మీదుగా.. తణుకు, పెరవలి, నిడదవోలు వైపు వెళ్లే వాహనాలను ఆలమూరు కంతేరు మీదుగా మళ్లిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సాక్షిపై దాడులు సిగ్గుచేటు

- పత్రికా స్వేచ్ఛను హరించేలా దౌర్జన్యాలు
- దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఏలూరులో నిరసన



ఏలూరు డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు

ఏలూరు టౌన్ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ బాధితులకు న్యాయం జరిగేలా పనిచేసే ఫోర్త్ ఎస్టేట్‌పై దాడులు సిగ్గుచేటని, ఇలాంటి విష సంస్కృతికి చెక్ పెట్టేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేపీకే కిషోర్, టైమ్స్ కిషోర్ అన్నారు. ఏలూరు సాక్షి జిల్లా కార్యాలయం వద్ద దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు మంగళవారం విధ్వంసానికి నిరసనగా.. ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. బుధవారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి ర్యాలీగా ఏలూరు డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్న జర్నలిస్టులు కొద్దిసేపు దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పత్రిక స్వేచ్ఛను హరిస్తూ పత్రికా కార్యాలయాలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని పేర్కొన్నారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సాక్షి కార్యాలయంలోకి అక్రమ చొరబడి, కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం ఘటనపై విచారణ చేయాలని, నిందితులను గుర్తించి కేసులు నమోదు చేయాలని కోరారు. డీఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ మరోసారి ఏలూరులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో నిందితులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మీడియా స్వేచ్ఛను అడ్డుకుంటే ప్రజలకు నష్టం

ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష,



డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రధాన కార్యదర్శులు కేపీకే కిషోర్, టైమ్స్ కిషోర్ మాట్లాడుతూ ... ఏలూరు జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టేలా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవటం దురదృష్టకరమన్నారు. **ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రిక, మీడియా స్వేచ్ఛను అడ్డుకుంటే ప్రజలు నష్టపోతారని, బాధితులకు న్యాయం దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లే క్రమంలో ఏదైనా తప్పు జరిగితే** దానిపై రాజకీయ నేతలు, ప్రతినిధులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి తప్ప దాడులు చేయటం సరైన విధానం కాదన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు, ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు భరత్ మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛను పరిరక్షించేందుకు అధికారులు తమవంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. ప్రజాప్రతినిధులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, వారే దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం ఏమాత్రం సమర్థనీయం కాదని అభిప్రాయపడ్డారు. ఏపీయూడబ్ల్యూజే పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా, మహిళా జర్నలిస్ట్ కొమ్మిన రత్న కుమారి మాట్లాడుతూ ఏలూరులోని సాక్షి కార్యాలయంపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు సంయమనంతో వ్యవహరించాలని, ఇష్టారాజ్యంగా దౌర్జన్యాలకు పాల్పడటం మంచి విధానం కాదన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్ల శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు పోతురాజు, పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్, ఏపీపీజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే రియాజ్, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు కే.వంశీ, శ్యామ్, ఎం.రాజేష్‌కుమార్, కే.శ్రీనివాస్, కర్రి అప్పలరాజు, బీ.రాము, వైవీ శ్రీనివాస్, టీవీఆర్‌కే ప్రసాద్, ఆర్.వెంకటనాయుడు, ఏడుకొండలు, కే.వినోద్‌కుమార్, అమీర్ పాషా, గంజి చంటి, బీ.భరత్‌కుమార్, కురెళ్ళ కిషోర్, ఇబ్రహీం, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, బలరాం, గాంధీ తదితరులు ఉన్నారు.

దాడికి పాల్పడ్డవారిని శిక్షించాలి : సీపీఎం

ఏలూరు (టూటౌన్): సాక్షి పత్రికా కార్యాలయంపై దాడిని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు తగిన విచారణ జరిపి, నిజానిజాలు వెలికి తీసి, అందుకు కారణమైనవారిని, దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఒకవేళ ఎవరిపైనైనా కొన్ని పత్రికలు అవాస్తవాలు ప్రచురిస్తే వాటిని ఖండించేందుకు అనేక మార్గాలున్నాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు దిగడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. సమస్య ఉంటే చట్ట ప్రకారం వెళ్ళాలేగాని, రాజ్యాంగాన్ని గౌరవించి, ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు ఈ విధంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు ఇలాంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరించాలని రవి కోరారు.

కేసులు పెట్టడానికి పదవి ఇవ్వలేదు

వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: ప్రజలకు సేవ చేయమని పదవి ఇచ్చారని, అంతేగానీ వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టడానికి పదవి ఇవ్వలేదని మంత్రి నిమ్మల రామానాయుడును నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ గుడాల గోపి హితవు పలికారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. గత నెలలో యలమంచిలి మండలంలో జరిగిన ఎంపిపి ఎన్నిక విషయంలో కూటమి ప్రభుత్వం విధ్వంసం సృష్టించి.. తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఎంపీటీసీ కంబాల సత్యశ్రీని పోలీసులు తీసుకువెళ్లడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులను ప్రశ్నించారని.. దాంతో ఎస్సై ఎంపీటీసిని తీసుకువచ్చేస్తామని చెప్పారని.. ఇప్పుడు రెండు రోజుల్లో ఏడుగురిపై అన్యాయంగా కేసులు పెట్టారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే తప్పంటే ఇంక ఈ ప్రజాస్వామ్యం ఎందుకని ప్రశ్నించారు. కేసులు పెడితే భయపడి మీ పంచన చేరతారని ఊహిస్తున్నారేమోనని.. అలాంటి నీచ రాజకీయాలు చేయవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ జగనన్నపై ప్రేమతో ఉన్నావారేనని.. పదవుల కోసమో, సంపాదన కోసమో ఉన్నవారు కాదని అన్నారు. అలాంటి అభిమానంతో వచ్చిన కేడర్‌ను మీరు ఎప్పటికి కొనలేరని.. బెదిరించి పార్టీలు మార్పించుకోలేరన్నారు. ఎప్పుడో రెండేళ్ల క్రితం టిడ్కో గృహాల్లో జరిగిన గొడవపై ఇప్పుడు కేసులు పెట్టించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పోలీసులను ఇష్టానుసారంగా ఉపయోగించుకోవడం అన్యాయమని అన్నారు. 41 నోటీసులు ఇచ్చిన తరువాత కూడా రోజూ భీమవరం పోలీస్‌స్టేషన్‌కు రమ్మని పిలవడం ఏంటో అర్థంకావడం లేదన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు

డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు



భీమవరం: పాలీసెట్ ప్రవేశ పరీక్షల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో వీఆర్వో పాలిశెట్టి-2025 ప్రవేశ పరీక్ష నిర్వహణపై కో ఆర్డినేటర్లు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు, సంబంధిత శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఏప్రిల్ 30న జరగనున్న పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 18 సెంటర్ల పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేయగా వీటిలో భీమవరంలో 4, తాడేపల్లిగూడెంలో 2, తణుకులో 8, నరసాపురంలో 4 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం 7,254 మంది విద్యార్థులు పాలీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 30న ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సెల్‌ఫోన్లు, వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమన్నారు. పరీక్షా కేంద్రాలు దగ్గరలో జిరాక్స్ షాపులు మూసివేయాలని, పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. జిల్లా ఖజానా అధికారి ఏ గణేష్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, కోఆర్డినేటర్ డి.ఫణీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

బాలికలదే పైచేయి

- 10 ఫలితాల్లో జిల్లాలో 82.15 శాతం మంది ఉత్తీర్ణత
- 78.84 శాతం బాలురు, 85.37 శాతం బాలికలు పాస్
- రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచిన జిల్లా
- రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 1 వరకు గడువు





రావి అశ్విని (592/600)



కొల్లి శాన్వి (590)



ఆముదాలపల్లి కార్తిక్ (589)



పడాల కావ్యశ్రీ (587)



అకిరి ఝాన్సీ (587)



చలువాది హరి ప్రియ (587)




వి. ప్రభాకర్ (587)



జి. తేజశ్విని (586)



రెడ్డి నవ్య (586)



సాధనాల లిఖిత దుర్గ (586

సాక్షి, భీమవరం: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. జిల్లాలో 82.15 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా వీరిలో బాలురు 78.84 శాతం, బాలికలు 85.37 శాతం ఉన్నారు. అత్యధిక ఉత్తీర్ణతలో రాష్ట్ర స్థాయిలో జిల్లా 16వ స్థానంలో నిలిచింది. 2024–25 విద్యా సంవత్సరానికి మార్చి 17 నుంచి 31 వరకు జిల్లాలోని 135 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. జిల్లాలో బాలురు 10,924, బాలికలు 10,615 కలిపి మొత్తం 21,539 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 17,695 మంది ఉత్తీర్ణత సాధించగా వీరిలో బాలురు 8,612(78.84 శాతం), బాలికలు 9,083 (85.57 శాతం) మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 12,610 మంది విద్యార్థులకు 9,090 (72.09 శాతం) మంది, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 8,929 మంది విద్యార్థులకు 8,605 (96.37శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. నాలుగు ప్రభుత్వ పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు. అత్యధిక ఉత్తీర్ణత శాతంలో గత ఏడాది 23వ స్థానం రాగా ఈ ఏడాది 16వ స్థానం సాధించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.నారాయణరావు తెలిపారు.

మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

పేదల విద్యకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గత ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా జిల్లాలోని 1,485 మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. నరసాపురంలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ స్కూల్‌కు చెందిన రావి అశ్విని అత్యధికంగా 592 మార్కులతో మెరిసింది. ఆకివీడులోని పీఎల్ఎస్ జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన కొల్లి శాన్వి 590, చినఅమిరంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆముదాలపల్లి శివసాయి వెంకటరామ కార్తిక్ 589, తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లోని పడాల కావ్యశ్రీ 587, అల్లంపురంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన అకిరి ఝాన్సీ 587, ఆరుగొలను జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చలువాది హరి ప్రియ శ్రీకోట వెంకట లక్ష్మి 587, సిద్ధాపురంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వాతాడి ప్రభాకర్‌కు 587, తాడేపల్లిగూడెం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన గొబ్బిళ్ల తేజస్విని 586, వీరంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రెడ్డి నవ్య 586, కోపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సాధనాల లిఖిత దుర్గలు 586తో అత్యధిక మార్కులు సాధించిన మొదటి పది మందిలో ఉన్నారు.

మే 19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం మే 19 నుంచి 28 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నట్టు అధికారులు తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు నెలాఖరు వరకు గడువుండగా, రూ.50 పెనాల్టీతో మే 18 వరకు ఫీజు చెల్లించవచ్చని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఫీజు గడువు పొడిగించరని తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ చేయించుకోవాలనే వారు గురువారం ఉదయం 10 గంటల నుంచి మే 1 మధ్యాహ్నం 11 గంటల వరకు సంబంధిత పాఠశాల హెచ్ఎంలకు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రీ కౌంటింగ్ నిమిత్తం ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలన్నారు. పోస్టు, కొరియర్ ద్వారా వచ్చిన దరఖాస్తులు, డీడీలు, చెక్కుల రూపంలో చేసిన చెల్లింపులు స్వీకరించరని చెప్పారు.

ఉగ్రవాదుల దుశ్చర్యపై ఆగ్రహ జ్వాలలు



భీమవరం : కొవ్వొత్తుల ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



అత్తిలి : నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కారుమూరి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

భీమవరం: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం భీమవరం పట్టణంలో కొవ్వొత్తులతో శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ప్రదర్శనలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు మాట్లాడుతూ శాంతియుత భావంతో అన్ని వర్గాల ప్రజలు కలసిమెలసి జీవిస్తున్న భారతదేశం ఇతర దేశాలకు ఆదర్శనీయమని అలాంటి దేశంలో ఉగ్రవాదుల చర్యలు దారుణమన్నారు. ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పర్యాటకులపై దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఇలాంటి ఘటనలు పునరావృతంగాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి, మతాల మధ్య చిచ్చుపెట్టడానికి ఇతర దేశాలు పన్నుతున్న కుట్రలను కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రజలు తీవ్రంగా పరిగణించి ఉగ్రవాదులపై కఠిన చర్యలకు సన్నద్ధం కావాలన్నారు. మరెక్కడా ఇటువంటి ఘటనలు తిరిగి చోటుచేసుకోకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఉగ్రదాడిలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, పార్టీ అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, పార్టీ కార్యదర్శి ఏఎస్ రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కర్రా జయచరిత, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, వైఎస్సార్‌సేవా దళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బందం పూర్ణచంద్రరావు, భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, చవాకుల సత్యనారాయణ, జల్లా కొండయ్య, పార్టీ నాయకులు కోడే యుగంధర్, చిగురుపాటి సందీప్, గంటా సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్ : నరేంద్ర సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అత్తిలిలో..

అత్తిలి: కశ్మీర్‌లో ఉగ్రదాడి దోషులను కఠినంగా శిక్షించి, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ దాడిలో చనిపోయిన వారికి శాంతి చేకూరాలని వైఎస్సార్‌సీపీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పించుకున్నాం



పహల్గాంలో పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన చైతన్య, అరుణల కుటుంబ సభ్యులు

పాలకోడేరు: వారంతా కశ్మీర్‌లోని పహల్గాంలో కొద్దిలో ఉగ్రదాడి నుంచి తప్పించుకున్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన సోము చైతన్య దీపక్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. చైతన్య, అతని సోదరి అరుణ, స్నేహితుడు చిన్నారావులు వారి కుటుంబాలతో కలిసి ఈ నెల 20న పహల్గాం, గుల్మార్గ్ వెళ్ళి ఉగ్రదాడి జరిగిన ప్రదేశంలోనే గడిపారు. సోమవారం రాత్రి అక్కడి నుంచి శ్రీనగర్ వెళ్లిపోయారు. సరిగ్గా మంగళవారం మధ్యాహ్నం వారు గడిపిన ప్రదేశంలోనే టూరిస్టులపై ఉగ్రదాడుల ఘటన తెలియడంతో భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే బంధువులకు సమాచారం అందించారు. అప్పటి నుంచి శ్రీనగర్‌లో రూంకే పరిమితమయ్యామని, గురువారం సాయంత్రం ఫ్లైట్‌కు తిరుగు ప్రయాణమవ్వాలని వారు తెలిపారు.

క్లుప్తంగా

పార్శిల్ సర్వీస్ సెంటర్ల తనిఖీ


పార్శిల్ సర్వీస్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో విజిలెన్సు, జీఎస్‌టీ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా పట్టణంలోని పార్శిల్ సర్వీసు కార్యాలయాలు ఎస్ఆర్ఎంటీ, నవత, సింధు పార్శిల్ సర్వీస్‌లను బుధవారం తనిఖీ చేశారు. జగదీశ్వర్‌రావుకు చెందిన రూ.1,88,800 విలువ కలిగిన 116 లీటర్ల నిషేధిత గ్లైఫోసైట్, కేంద్ర ప్రభుత్వం నిషేధించిన డైక్లోరావోస్ పురుగు మందులు ఎటువంటి లైసెన్స్, బిల్లులు లేకుండా ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సీతారాము, జీఎస్‌టీ అధికారి బి.దానేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు.

ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్‌గా రాజ్‌కుమార్


రాజ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్‌గా కత్తుల రాజ్‌కుమార్ బుధవారం రాజమహేంద్రవరంలోని జోనల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన కరీంనగర్ జోన్ నుంచి పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. రాజమహేంద్రవరం జోన్ పరిధిలోని కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 శాఖలకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తారు. ఇప్పటి వరకు జోనల్ కార్యాలయం పరిధిలో రూ.10,037 కోట్ల వరకు వ్యాపారం జరిగినట్లు బ్యాంక్ వర్గాలు తెలిపారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

గంటల వ్యవధిలో ఆచూకీ కనుగొన్న పోలీసులు

భీమవరం: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంటల వ్యవధిలో మైనర్ బాలిక మిస్సింగ్ కేసును ఛేదించినట్లు భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ బుధవారం చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థి బాలిక (14 ఏళ్లు) ఈనెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు కన్పించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు చుట్టుపక్కల, సమీప బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆ రోజు రాత్రి 11 గంటలకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సదరు బాలిక ఆచూకీ కోసం ముందుగా జిల్లా వ్యాప్తంగా లుక్ ఔట్ నోటీసులు జారీ చేసి డాగ్ స్క్వాడ్, డ్రోన్స్ సహాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించినా ఫలితం లేకపోయింది. అనంతరం చుట్టుప్రక్కల ప్రదేశాల్లోని సీసీ టీవీ కెమేరాల ఫుటేజ్ పరిశీలించి, సదరు బాలిక పూరీ – తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం వైపు ప్రయాణిస్తున్నట్లు గ్రహించి తుని, అనకాపల్లి, విశాఖపట్నం రైల్వే స్టేషన్లలోని జీఆర్‌పీ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసు అధికారులకు సమాచారమిచ్చారు. బుధవారం విశాఖపట్టణం రైల్వే స్టేషన్‌లో బాలికను విశాఖ రైల్వే పోలీసులు గుర్తించి భీమవరం టూటౌన్ పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికెళ్లి బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

ఉంగుటూరు: యర్రమళ్ల గ్రామంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానుకొండ బాబూరావు (50), అతని భార్య పదేళ్ల నుంచి విడిగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి బాబూరావు ఇంటి సమీపంలోని చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. బాబూరావు మృతదేహానికి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బుధవారం అంత్యక్రియలు పూర్తిచేశారు.

పదును తగ్గిన కొడవలి

- యాంత్రీకరణతో కనుమరుగు
- ఆదరణ తగ్గుతున్న వైనం
- కొడవళ్ల తయారీకి ముప్పర్తిపాడు ప్రసిద్ధి


కొడవళ్లు


కొలిమిలో కొడవలిని కాలుస్తున్న కమ్మరి


కొడవలికి పదును పెడుతున్న దృశ్యం

గణపవరం: ఒకప్పుడు వ్యవసాయంలో ప్రముఖ పాత్ర పోషించిన కొడవలి క్రమంగా తన బాధ్యతలనుంచి దూరమైపోతుంది. గతంలో చేతిలో కొడవలి లేకుండా రైతు కనిపించేవాడు కాదు. ఉదయాన్నే చద్దన్నం తిని భుజాన తుండు వేసుకుని, చేతిలో కొడవలి పట్టుకుని పొలానికి పయనమయ్యేవాడు రైతు. కొడవలికి, రైతులకు అంతటి అనుబంధం ఉండేది. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. కొడవలి దాదాపు రైతుచేతికి దూరమైపోయింది.

ఇక వరికోతల సమయంలో కొడవళ్లకు ఎక్కడాలేని గిరాకీ ఉండేది. వ్యవసాయంలో యాంత్రీకరణతో సంప్రదాయ వ్యవసాయ పనిముట్లు కనుమరుగైపోయాయి. వీటి బాటలోనే కొడవలి కూడా చేరింది. దశాబ్దాలుగా వరికోతలకు కొడవళ్లే ఆధారం. వరికోతలు ప్రారంభం అయ్యాయంటే రైతులు, వ్యవసాయ కూలీలు కొత్త కొడవళ్ల కోసం కమ్మరి కొలిమి వద్ద బారులు తీరేవారు. పాత కొడవళ్లకు పదును పెట్టడం, కక్కుళ్లు కోయించడం, చెక్కపిడి వేయించడం, కొత్త కొడవళ్లు కొనుగోలు చేయడంతో కొడవళ్ల తయారీదారులకు ఊపిరి సలపనంతగా చేతినిండా పని ఉండేది. ఇటీవల వరికోతలు కోయడానికి కోత యంత్రాలు రంగప్రవేశం చేయడంతో కొడవళ్లకు పనిలేకుండా పోయింది. దీనితో ఈ వృత్తినే నమ్ముకున్న వారు ఉపాధి కోల్పోయి వీధిన పడుతున్నారు.

కొడవళ్ల తయారీ కేంద్రం ముప్పర్తిపాడు

గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామం కొడవళ్ల తయారీ కేంద్రంగా దశాబ్దాలుగా పేరొందింది. గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, ఉండి, అత్తిలి, పెంటపాడు, తణుకు తదితర మండలాల నుంచి రైతులు, కూలీలు ముప్పర్తిపాడు వచ్చి కొడవళ్లు కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. కణకణలాడే అగ్నికీలల నుంచి ఎగసిపడే అగ్గిరవ్వలు, లయబద్ధమైన సుత్తిదెబ్బల సవ్వడులు, అగ్గిరాయిమీద కొడవళ్లకు పదును పెట్టి కక్కుళ్లకోసే ధ్వనులు ఆ గ్రామంలో సర్వసాధారణం. ఈ కొడవళ్ల తయారీపై కొన్ని కుటుంబాలు ఆధారపడి ఉండేవి. ఈ గ్రామంతో పాటు గణపవరం, నిడమర్రు గ్రామాల్లో కూడా కొడవళ్ల తయారు చేసే కమ్మరి కొలుములు ఉండేవి. వరికోతల సీజన్ ఆరంభం అయితే రేయింబవళ్లు కొడవళ్లు తయారు చేస్తూ క్షణం తీరిక లేకుండా కమ్మరి కార్మికులు ఇప్పుడు పనిలేక గోళ్లు గిల్లుకుంటున్నారు. గణపవరం, నిడమర్రు మండలాల్లో సుమారు 150 మంది వరకూ ఈ కమ్మరి కార్ఖానాలలో పనిచేస్తూ జీవనం సాగించేవారు. వేలాదిగా కొడవళ్లు తయారు చేసి స్థానికంగా అమ్మడమే కాక, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు, ఇతర జిల్లాలకు కూడా సరఫరా చేసేవారు. ఒక్కో కొడవలి నాణ్యతను బట్టి రూ.100 నుంచి రూ.150 వరకూ విక్రయించేవారు. పదును పెట్టడానికి, కొడవలికి పళ్లు(కక్కుళ్లు) కోయడానికి రూ.20 తీసుకునేవారు. ఇప్పుడు రోజుకు పదో, పరకో కొడవళ్లు మాత్రమే అమ్ముతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.

కొలిమిలో కాలి.. పదునైన కొడవలిగా మారి

కొడవలి తయారీకి ప్రత్యేకమైన ముడి ఇనుమును(లారీలకు వాడే కమానుకట్టలు) బద్దలుగా తీసుకువచ్చి కొలిమిలో బాగా కాల్చి కొడవలి ఆకారంలో మలుస్తారు. దానికి సానపట్టి పళ్లు కోసిన తర్వాత చెక్కపిడిని అమరుస్తారు. ఈవిధంగా ఒక్కో కొలిమిలో రోజుకు సుమారు 200 కొడవళ్లను తయారు చేస్తారు. నాణ్యతను బట్టి మూడు రకాలుగా కొడవళ్లు తయారు చేస్తారు. రూ.80, రూ.100, రూ.150 ధరలలో తయారుచేస్తారు. ప్రత్యేక ఇనుముతో పాటు ప్రత్యేకమైన రేకుతో కూడా కొడవళ్లు తయారు చేస్తారు.

కోత యంత్రాలతో కనుమరుగవుతున్న కొడవళ్లు

వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక, నూతన సాంకేతిక పద్ధతులతో సంప్రదాయ పద్ధతులు కనుమరుగవుతున్నాయి. దీనిలో భాగంగా వరికోతకు యంత్రాల వినియోగం బాగా పెరిగిపోయింది. ఇటీవలి వరకూ పశువులమేత కోసమైనా కొందరు రైతులు కూలీలతో వరికోతలు కోయించేవారు. రానురాను కూలీలతో కోత కోయించడం మానుకుని రైతులంతా వరికోత యంత్రాలమీదనే ఆధారపడటంతో కొడవళ్లు కొనే నాథుడు కనిపించడంలేదు.

ఇతర ప్రాంతాల నుంచి ముడిసరుకు

కొడవళ్ల తయారీకి ఉపయోగించే బేల్ బద్దలను చెన్నై, విశాఖ, కాకినాడ, విజయవాడ పట్టణాల నుంచి కిలోల లెక్కన దిగుమతి చేసుకుంటారు. ముడిసరుకు ధరలు కూడా ఏటికేడు పెరగడంతో కొడవళ్ల తయారీ గిట్టుబాటు కావడంలేదని తయారీదారులు వాపోతున్నారు. గత ఏడాది లోడు బేల్‌బద్దలు రూ.50 వేలు పలుకగా ఈ ఏడాది రూ.65 వేలకు చేరిందని, ఆమేరకు కొడవళ్ల ధర పెంచితే కొనుగోలు దారులు వెనుకంజ వేస్తున్నారని వాపోతున్నారు. అలాగే కొలిమిలోకి వాడే బొగ్గు, ఊక ధరలు కూడా పెరిగిపోయాయని, పనిలోకి వచ్చేవారికి కూలీ ధరకూడా పెరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదరణ తగ్గుతుంది



నేను 50 ఏళ్లుగా కొడవళ్లు తయారు చేస్తున్నాను. తాతలనాటి నుంచి వచ్చిన కమ్మరి వృత్తిలో ఇప్పుడు కుటుంబం గడవడమే గగనంగా ఉంది. గతంలో రోజుకు 100 వరకూ కొడవళ్లు అమ్మేవాళ్లం. దశాబ్ద కాలంగా కొడవళ్ల అమ్మకాలు బాగా పడిపోయాయి. ఇప్పుడు రోజుకు ఐదారు కొడవళ్లు కూడా అమ్ముడుపోవడం లేదు. వీటితో పాటు కత్తులు, పారలు, గునపాలు తయారు చేస్తున్నాం. రానున్న కాలంలో ఈవృత్తి బతికి బట్ట కట్టాలంటే ప్రభుత్వం కమ్మరి వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు ఇచ్చి, సబ్సిడీ ధరలకు ముడిసరుకులు అందించాలి.

– సత్యనారాయణ, కమ్మరి వృత్తిదారు

మెరిసిన కాకతీయ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కాకతీయ యాజమాన్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని కాకతీయ మెరిట్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని స్కూల్ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్ బుధవారం చెప్పారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారిలో ఎస్ వెంకట హర్షిణి 592, బి జయశ్రీ 589, బి రవి ఆదినారాయణ 587 మార్కులు సాధించారన్నారు. అలాగే 26 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించగా 10 మంది విద్యార్థులు 570 కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు చెప్పారు.

ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య యాజమాన్యం

భీమవరం: పదవ తరగతి పరీక్షల్లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు చెప్పారు. విద్యార్థులు ఎంఎస్ నాగశివాని 587, ఎం శర్వాణి 585, పీఎస్ఎస్‌వీ రామ్‌నిహాల్ 585, డి రాఘవశ్రీనిధి 584, ఎస్ దర్శన్‌బాబు 584, వై దాక్షిణ్య 584, ఎం ఆర్షియ 583, ఎన్ జనని 582, ఎం వర్షిత 580, పి హర్షవర్ధన్‌రాజు 580 మార్కులు సాధించినట్లు వివరించారు. మొత్తం విద్యార్థుల్లో 80 మంది 540కు పైగా, 124 మంది 500కు పైగా మార్కులు సాధించినట్లు కృష్ణంరాజు చెప్పారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు


ప్రధాన కూడలిలో 40 అడుగుల స్వామివారి విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్న సిబ్బంది


తూర్పు రాజగోపురానికి అమర్చిన విద్యుద్దీప తోరణాలు

- మే 7 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 11న రాత్రి శ్రీవారి తిరుకల్యాణం, 12న రథోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. మే 7 నుంచి 14 వరకు జరగనున్న చిన వెంకన్న తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా 11న రాత్రి స్వామివారి కల్యాణం, 12న రాత్రి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న ఏర్పాట్లలో భాగంగా ఆలయ పరిసరాలను, దర్శనం క్యూలైన్లను రంగులతో ముస్తాబు చేసేందుకు, అలాగే స్వామివారి పాదుకా మండప ప్రాంతంలో, ఆలయ ధ్వజస్తంభం వద్ద తాటాకు పందిళ్లు నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం గుడి సెంటర్‌లోని ప్రధాన కూడలిలో 40 అడుగుల శ్రీవారి భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆలయ గోపురాలకు, పరిసరాలకు విద్యుద్దీప తోరణాలను అమర్చారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి కోరారు.

శశి విద్యార్థుల విజయభేరి


శశి విద్యార్థులతో ఇన్‌చార్జ్ రాజేంద్రప్రసాద్

తణుకు అర్బన్: పదో తగరతి పరీక్షా ఫలితాల్లో తణుకు శశి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు అత్యున్నత మార్కులతోపాటు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. విద్యార్థుల్లో తోరం సుప్రియ 595 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, పైడి రసజ్ఞ, సత్తి లహరి, గాదిరాజు జోషిత 594, నాయుడు లక్ష్మీ వెంకట సుజిత్ చౌదరి 593, సావిరిగాన జాహ్నవి 592, అల్లాడబోయిన మోనికసాయి 591, మండేలా మాధుర్య రమాసాయి, సైపురెడ్డి సత్యశ్రీ, బొల్లా లక్ష్మీ దీపక్ చౌదరి, కాపకాయల సాయి పవన్ గణేష్, పైడి మణి మాలతి, కంకిపాటి ప్రేస్‌పాల్, మద్దల మణికంఠ పవన్‌సాయి, పాటే పద్మశ్రీ, సుంకవల్లి హర్షిత చౌదరి 590 మార్కులు చొప్పున సాధించినట్లు వివరించారు. విద్యార్థులను సంస్థ వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాదెళ్ల ప్రసాద్, తణుకు శశి క్యాంపస్ ఇన్‌చార్జ్ నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

రూట్స్ ప్రభంజనం


హన్సిత పద్మినిని అభినందిస్తున్న రూట్స్ డైరెక్టర్లు

తణుకు అర్బన్: తరగతి పరీక్షా ఫలితాల్లో తణుకు రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్‌కే త్రిపాఠి తెలిపారు. పరీక్షకు హాజరైన 183 మంది విద్యార్థుల్లో అత్యధికంగా యు.హన్సిత పద్మిని 596 మార్కులు, పి.మోహన్య 591, వై.నీరజా షైనీ 590 మార్కులు సాధించారన్నారు. 580 మార్కులకుపైగా 17 మంది, 570కిపైగా 36 మంది, 560కిపైగా 59 మంది, 550కిపైగా 69 మంది, 500కుపైగా 123 మంది సాధించారని వివరించారు. విద్యార్థులను రూట్స్ డైరెక్టర్లు ఎల్‌కే త్రిపాఠి, బి.వి ద్యాకాంత్, ఎస్.సుధాకర్‌వర్మ అభినందించారు.

మాంటిస్సోరీ విజయకేతనం


విద్యార్థిని జిగీషా మాల్యను అభినందిస్తున్న మాంటిస్సోరీ స్కూల్ డైరెక్టర్ ప్రకాశరావు

తణుకు అర్బన్: తణుకు మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసినట్లు స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. పాఠశాల నుంచి 199 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా విద్యార్థిని టి.జిగీషా మాల్య అత్యధికంగా 594 మార్కులు సాధించినట్లు చెప్పారు. 580కిపైన 11 మంది, 550కి పైన 73 మంది మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను ప్రకాశరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విశ్వకవి నూరు శాతం ఉత్తీర్ణత


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: టెన్త్ పరీక్షా ఫలితాల్లో భీమవరం పట్టణ పరిధిలోని చినఅమిరం విశ్వకవి స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ పాట్లూరి రఘుబాబు చెప్పారు. విద్యార్థుల్లో వి ఫణి 591, వై చరణ్ మహి 589 అత్యధిక మార్కులు సాధించారన్నారు. మరో నలుగురు విద్యార్థులు 580కి పైగా మార్కులు సాధించారన్నారు.

అమ్మోనియా గ్యాస్ లీక్.. ఐదుగురికి అస్వస్థత


చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సీపీఎం నేత గోపాలన్

పాలకోడేరు: పాలకోడేరు మండలంలోని మోగల్లు గ్రామంలోని వశిష్ట ఆక్వా మెరైన్ పరిశ్రమలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో అమ్మోనియా గ్యాస్ లీకై ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. కార్మికుల కథనం ప్రకారం.. ఫీజర్ కూలింగ్ కోసం పైపు లైన్ ద్వారా అమ్మోనియా గ్యాస్ పంపుతుండగా హఠాత్తుగా పైపు పగిలిపోయింది. దీంతో ఒక్కసారిగా కార్మికులు పరుగులు తీశారు. దీంతో కొందరు కింద పడి గాయాలపాలుకాగా మరి కొందరు గ్యాస్ పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో బిటిక గీతకు (ఒడిశా రాష్ట్రం రాయగడ), కౌసల్య ఒడిశా (కరిది), శ్యామ్ (రాయగడ)కు గాయాలు కాగా సునమ్ (రాయగడ), బి రాణి అమ్మోనియా గ్యాస్ పీల్చి అస్వస్థతకు గురయ్యారు. వీరందరిని రొయ్యల ఫ్యాక్టరీ యాజమాన్యం భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇందులో ఇద్దరు కార్మికుల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

ప్రశ్నార్థకంగా రక్షణ చర్యలు

ఆక్వా పరిశ్రమల్లో రక్షణ చర్యలు ప్రశ్నార్థకంగా కనిపిస్తున్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి బాల కార్మికులు కూడా ఇక్కడ ఆక్వా పరిశ్రమల్లో పనులు చేస్తుండడం ఆందోళన కలిగించే విషయం. దీనిపై కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఏ రాణి స్పందిస్తూ బాధితుల్లో, కార్మికుల్లో మైనర్లు ఉంటే శాఖ పరమైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వా మెరైన్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

ఉంగుటూరు: గోపినాథపట్నం భక్తాంజనేయ స్వామి క్షేత్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భూదేవి శ్రీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి, శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాధినీ కుమారి దంపతులు, కొట్టు సోదరులు మురళీ, తాతాజీ దంపతులు, కుటుంబసభ్యులు ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. వివిధ నదీ జలాలతో విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, సంపత్ కుమార్, మానుకొండ వేంకటేశ్వరరావు, చెన్నా జనార్దనరావు, గోపినాథపట్నం సర్పంచ్ పుత్సకాయల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు. పండితుడు ఆంజనేయ ప్రసాద్‌కు మాజీ మంత్రి కొట్టు సువర్ణ కంకణం తొడిగి పండిత సత్కారం చేశారు.

కోపల్లెలో ఎక్సైజ్ దాడులు

కాళ్ల: అనధికారంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో ప్రొహిబిషనరీ – ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం విక్రయిస్తున్న వీరవల్లి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద 5 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

పెనుగొండ: ప్రమాదవశాత్తు గోదావరిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం కరుగోరుమిల్లి ముత్యాలవారిపాలెంకు చెందిన ముత్యాల సత్యనారాయణ (70) ఉపాధి కూలీ నిమిత్తం మంగళవారం కోడేరు లంకకు వెళ్లాడు. పనుల అనంతరం తిరిగి వస్తుండగా మధ్యాహ్నం గోదావరిలో స్నానం చేయడానికి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. మృతుడు జోళ్లు, ఇతర సామాగ్రి పడవలోనే ఉండడంతో గోదావరి మధ్యలో పడిపోయి ఉంటాడని భావించి వెతికినా ఫలితం లేకపోయింది. బుధవారం ఉదయం కోనసీమ జిల్లా గన్నవరం పుష్కర రేవు వద్ద లభించిన మృతదేహం సత్యనారాయణదిగా బంధువులు గుర్తించారు. మృతుడుకు భార్య, కుమారుడు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. గన్నవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొయ్యల ఫీడ్ ధరలను తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి సుబ్బరాజు

పాలకోడేరు: రొయ్యల ఫీడ్ ధరలు కేవలం రూ.4 తగ్గించడం సబబుకాదని, రూ.20 తగ్గించాలని పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు ఎస్ గజపతిరాజు, కార్యదర్శి జీకేఎఫ్ సుబ్బరాజు, రైతులు డిమాండ్ చేశారు. బుధవారం గొల్లలకోడేరులో నిర్వహించిన జిల్లా సమావేశంలో రైతులు మాట్లాడుతూ రొయ్యల కొనుగోలులో 60–50కి 50–40కి 40–30కి ఇదివరకు ఉన్న శ్లాబులను మళ్లీ పునరుద్ధరించాలని, అలాగే జోన్లు, ఎకరాలతో సంబంధం లేకుండా 1.50కి సబ్సిడీతో కూడిన కరెంటుని తక్షణమే క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని కోరారు. అప్పడా వైస్ చైర్మన్ రమణారెడ్డి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో ధరల స్థిరీకరణ 10 రోజులకీ జరిగినప్పటికీ ఈ మిగతా మూడు అంశాల్లో రైతులకి న్యాయం చేకూరాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కరించరని యెడల మే 10న జరగనున్న సమాఖ్య సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో వీరవాసరం మండలం తులసి రాంబాబు, ఆకివీడు మండలం బుజ్జి, ఇరగవరం మండలం బుజ్జి, గణపవరం మండలం వినాయక, నిడమర్రు మండలం నాని, ఆక్వా రైతు సోదరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

25 నుంచి బైబిలు తరగతులు

పెంటపాడు: గూడెం టౌన్ ఎక్లాస్ ఫ్యారిష్ సెంటినరీ లూథరన్ చర్చిలో ఈనెల 25 నుంచి మే 3 వరకు చిన్నారులకు వేసవి విరామబైబిలు తరగతులు నిర్వహించనున్నట్లు సంఘ గురు మండల అధ్యక్షుడు డీఎల్ పీనెహాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులు విజయవంతం చేయాలని, సండే స్కూలు విద్యార్థులు, చిన్నారులు ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

యలమంచిలి: మండలంలో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులంతా సంబంధిత రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి ఈ–పోస్ యంత్రంలో వేలిముద్రలు వేసి ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే చాలామంది ఈ కేవైసీ వేశారని, ఇంకా 4100 మంది పెండింగ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ–కేవైసీ చేయించుకోని లబ్ధిదారుల కార్డులు రద్దువుతాయని, కాబట్టి లబ్ధిదారులు అందరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 14 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన ఎంఎస్ఎన్ లేబరేటరీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 14 మంది అభ్యర్థులు ఎంపికై నట్లు కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో ఈ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులకు రూ. 20 నుండి 25 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు 48 మంది అభ్యర్థులు ఎంపికవ్వగా 14 మంది ప్లేస్‌మెంట్లు వచ్చాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, సెక్రటరీ సీతారామరాజు, ట్రెజరర్ రేపాక ప్రవీణ్ భాను, ఏబీఎస్ మూర్తి పాల్గొన్నారు.

చిట్టిబాబుకు పదవీ విరమణ సత్కారం

పాలకొల్లు సెంట్రల్: ఉపాధ్యాయులు తరగతికే పరిమితం కాకూడదని తన చుట్టూ ఉన్న సమాజానికి కూడా సేవ చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బుర్ర గోపిమూర్తి అన్నారు. బుధవారం స్థానిక బీఆర్ఎంవీఎం హైస్కూల్లో సీకరపల్లి చిట్టిబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో భాగంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ చిట్టిబాబు లాంటి మాస్టారు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. తన వృత్తిలో భాగంగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గుమ్మల్ల వీరాస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ ఝాన్సీ లక్ష్మీబాయ్, ఎంఈఓ–2 శర్మ, ఉపాధ్యాయులు చిట్టిబాబును ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా ఫేయిర్‌వెల్

నరసాపురం రూరల్: మండలంలోని గొందిమూల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సభ(ఫెయిర్‌వెల్)ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి విద్యార్థులతో వారికి పాదపూజ చేయించారు. అనంతరం తల్లిదండ్రుల ఔన్నత్యం గురించి విద్యార్థులకు వివరించారు.

వ్యక్తిపై ఇనుప రాడ్డుతో దాడి

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఎస్ఆర్ నగర్‌లో ఓ వ్యక్తి ఇనుపరాడ్డుతో వీరంగం సృష్టించాడు. దుకాణం షట్టరు నుంచి శబ్దం వస్తుందంటూ కె.విజయ ప్రసాద్ అనే వ్యక్తి, దుకాణ యజమాని బొండాడ నర్సింహరావుపై దాడి చేయగా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

చదువుతోపాటు వృత్తి విద్యలో రాణించాలి

కాళ్ల: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే కోర్సులను ఎంచుకుని చదువుతో పాటు వృత్తి విద్య లో కూడా రాణించాలని కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం జె.సీతా రామమూర్తి తెలిపారు. కలవపూడి గ్రామంలో ఉన్న వేటుకూరి వెంకట సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులు పాల్గొన్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. పది రోజులు పాటు నిర్వహించినఈ కోర్సుల్లో వృత్తి నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకున్నారని పేర్కొన్నారు.

జెడ్పీ పాఠశాల పరిశీలన

పెనుగొండ: మండలంలోని చెరుకువాడ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్యామ్ సుందర్ బుధవారం పరిశీలించారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు రాష్ట్ర అధికారులకు నివేదిక అందిస్తామని స్పష్టం చేశారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం

తణుకు అర్బన్: విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల కృషి కారణంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి పేర్కొన్నారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా మా పాఠశాల విద్యార్థిని పడాల కావ్యశ్రీ 600 మార్కులకుగాను 587 మార్కులు సాధించి అత్యున్నత స్థాయిలో నిలిచిందన్నారు. 580 మార్కులతో కె.తన్మయి ప్రియ, 578 మార్కులతో పాలాటి వర్షిణి, తిరుపతిపాటి శ్రీవల్లి నిలిచారు. ప్రథమ శ్రేణిలో 147 మంది, ద్వితీయ శ్రేణిలో 29 మంది, పాఠశాల నుంచి మొత్తం 298 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 203 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. స్కూలు స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటీ కో ఆప్షన్ సభ్యులు తాతపూడి మారుతీరావు విద్యార్థులను అభినందించారు.

పైడిపర్రు పాఠశాలలో..

పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 74 శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్ఎమ్ ఎం.ఏడుకొండలు తెలిపారు. మొత్తం 27 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 20 మంది ఉత్తీర్ణత సాధించారని పసుపులేటి భార్గవి 519 అత్యధిక


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు టీవీఆర్కె, ఎం. శ్రీనివాస్‌లు


తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం పద్మావతి

మార్కులు సాధించినట్లు వివరించారు.

విద్యార్థులకు అభినందనలు

పెంటపాడు: మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం.శ్రీనివాస్‌లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మండలంలో మొత్తం 662 మంది విద్యార్థులకు 555 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో మండలంలో అలంపురంకు చెందిన ఎ. ఝాన్సీ(587),ఎం. హేమ (582), మీనవిల్లూరుకు చెందిన కె. చిరువెంకట్రాజు (578) వరుసగా మండలంలో మూడు ర్యాంకులు సాధించినట్లు ఎంఈవోలు తెలిపారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

587మార్కులతో సత్తాచాటిన హరిప్రియ

తాడేపల్లిగూడెం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్.హరిప్రియ 587మార్కులు సాధించి మండల ప్రథమంగా నిలిచారు. అలాగే రెడ్డి నవ్య – వీరంపాలెం (586), ఎ.నవ్యశ్రీ – వెంకట్రామన్నగూడెం (582) మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి అభినందించారు.

అత్తిలి మండలంలో 89.15 శాతం ఉత్తీర్ణత

అత్తిలి: పదో తరగతి పరీక్షా ఫలితాలలో అత్తిలి మండలంలో 89.15 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి ఎంవీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన టెన్త్ పరీక్షా ఫలితాలలో అత్తిలి బాలికొన్నత పాఠశాలకు చెందిన పి షారోన్ బ్లెస్సీ 582 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె సత్యనారాయణరెడ్డి 581 మార్కులు సాధించి ద్వితీయస్థానం, అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి రవివర్మ 580 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. మండలంలో 428 మంది పరీక్షలకు హాజరుకాగా 378 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారన్నారు. టెన్త్ ఫలితాలలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను ఎంఈఓలు రమేష్, ప్రసాద్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


తణుకు తిరుమల స్కూల్‌లో సత్తాచాటిన విద్యార్థులు


అత్తిలి ఎంవీఆర్ మాంటిస్సోరి స్కూల్‌లో విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం


తనూజను అభినందిస్తున్న పూర్ణోదయ స్కూల్ డైరెక్టర్

తణుకు అర్బన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తణుకు తిరుమల ఇంగ్లీషు మీడియం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. 17 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా నూరు శాతం ఉత్తీర్ణులైనట్లు వివరించారు. విద్యార్థులు ఆర్.గౌతమ్ సుధీప్ 591, పి.కృష్ణ సందీప్ 590, టి.జయరామరెడ్డి 589, ఎస్.శ్రీదుర్గ 583 మార్కులు సాధించినట్లు చెప్పారు. 590పైన ఇద్దరు, 580పైన నలుగురు, 570పైన ఏడుగురు, 560పైన 8 మంది, 550పైన 11 మంది, 500పైన 14 మంది మార్కులు సాధించినట్లు వివరించారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి, విద్యాసంస్థల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నీలాద్రిపురం నారాయణ స్కూల్


సన్‌షైన్ విద్యార్థినితో యాజమాన్యం

విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి ఫలితాలలో నీలాద్రిపురం నారాయణ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ వాకలపూడి రామకృష్ణ, డైరెక్టర్ వాకలపూడి రామచంద్రరావులు వెల్లడించారు. బి.వేదిత 591 మార్కులు, వై.పావని 590, జే.మాళి 589, టి.దుర్గారాం 584, పి.లలిత కుమారి 583, బి.మనస్వి 581 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. పదోతరగతి ఫలితాలలో పట్టణానికి చెందిన దివ్యాంగ బాలుడు బద్దెల సాయి కుమార్ ఉత్తీర్ణత సాధించాడు.

పూర్ణోదయ స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత

స్థానిక రామరావుపేటలోని పూర్ణోదయ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాలలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. శీలి తనూజ 576, రామిశెట్టి దీక్షా సాత్విక 545, బి.చాణిక్య 527, పి.చంద్రసాయి 511, జి.అభిషేక్ 505, పి.యశ్వంత్ 501లు స్కూల్ టాపర్స్‌గా నిలిచారు. పదో తరగతి విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ పచ్చిపాల శివశంకర్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సన్ షైన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పదోతరగతి ఫలితాల్లో స్థానిక భాగ్యలక్ష్మిపేటలోని సన్ షైన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించారు. స్కూల్ ఫస్ట్ పి.బాల శ్రీమనీ దుర్గ 596, బి.పద్మ శ్రీ వెంకట ప్రమీల 587, కె.హర్ష 573, ఎన్.లలిత 571, వి.శివ శంకర్ 560, వి.రమాదేవి 556, కె.రిషి 550, బి.లక్ష్మీప్రియ 556, ఎన్.సాత్విక్ రాజు 551, ఎస్.మహేష్ 529, ఎ.లోహిత కృతి 527, ఎన్.ప్రకాష్ రాజ్ 519, జి.అభినవ కుమార్ 501లు సాధించారు. విద్యార్థినీ విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ జీవీ శ్రీనివాసులు, డైరక్టర్ జినాగలక్ష్మి, ప్రిన్సిపాల్ జి.ప్రసాద్‌లు అభినందనలు చెప్పారు.

పది ఫలితాల్లో ఎంవీఆర్ మాంటిస్సోరి ..

అత్తిలి: పదో తరగతి పరీక్షా ఫలితాలలో తమ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని అత్తిలి ఎంవీఆర్ మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ ఎంఎల్ఎస్ఎన్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఫలితాలలో టి దీప్తి 585 మార్కులు సాధించినట్లు స్కూల్ ప్రతినిధులు తెలిపారు. పదో తరగతి పరీక్షలలో 43 మంది 500 పైగా మార్కులు సాధించారని, 39 మంది విద్యార్థులు ఫస్ట్‌క్లాస్ సాధించారని చెప్పారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఎల్ఎస్ఎన్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉప్పరగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీల సమస్యలను సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలి సొమ్ములు నెలల తరబడి రావడం లేదని, తాము ఎలా బతకాలని వాపోతున్నారని సోమరాజు తెలిపారు. ప్రతీ 15 రోజులకు వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని, రద్దు చేసిన సమ్మర్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక పక్క నిత్యావసర వస్తువుల ధరలు, మరో పక్క విద్యుత్ చార్జీలు అదనపు భారం వెరసి పేదల నెత్తిపై భారం పడుతుందన్నారు. ప్రజలపై భారాలు తగ్గించాలన్నారు. దండే వెంకన్న, ఏలూరు వెంకాయమ్మ, మరపట్ల పవిత్ర, యడవల్లి వేణు, సుజాత, కప్పల మేరీకుమారి, రాధ, డి. బేబి రాణి, ఎం.సుబ్బారావు, వెంకట్రావు, దండే చినగోతియ్య పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

‘ఉపాధి’లో రజక వృత్తి చెరువులను తవ్వించాలి

తాడేపల్లిగూడెం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రజక వృత్తి చెరువులను తవ్వించాలని రజకజన సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విశ్వనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవోలను, జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల ఆక్రమణలపై జిల్లా సర్వేయర్లతో సమగ్రంగా సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలన్నారు. రజకుల వాస్తవ స్థితిలోని చెరువు విస్తీర్ణాన్ని బట్టి లీజు నిర్ధారించాలని కోరారు. జిల్లాలోని ప్రతీ మండల అభివృద్ధి అధికారిని కలిసి చెరువులను అభివృద్ధి చేయాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నేతలు పొమ్మంటి మురళీ, వి.శ్రీనివాస్, నల్లజర్ల అన్నవరం, లక్ష్మీప్రసన్న, శేషు, రజక నాయకులు పాల్గొన్నారు.


ఎంపీడీవో విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రజకజన సంఘ జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

స్వర్ణాంధ్రలో పేటెంట్ హక్కుపై వర్క్‌షాపు

నరసాపురం రూరల్: ఒక ఆవిష్కరణను తయారు చేసి చట్టపరమైన హక్కును పొందడమే పేటెంట్ అని విశాఖ పట్టణానికి చెందిన నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ యస్‌వీఏఎస్ రాజ్ అన్నారు. మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐటీసీ) వారి ఆధ్వర్యంలో పేటెంట్ హక్కులపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వారు నిర్వహించే ప్రాజెక్ట్స్, నూతన ఆలోచనా విదానాలను పేటెంటింగ్‌లా ఎలా మలచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎయస్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

నరసాపురం రూరల్: మండలంలోని పేరుపాలెం బీచ్ వద్దకరు ఆత్మహత్య చేసకోవడానికి వచ్చిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకు వచ్చాడని డయల్ 112కు బుధవారం ఓ ఫోన్ వచ్చింది. స్పందించిన మొగల్తూరు ఎస్సై జి.వాసు సదరు వ్యక్తిని పేరుపాలెం బీచ్లో గుర్తించి ఔట్‌పోస్టులో విధుల్లో ఉన్న సిబ్బంది సహకారంతో అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

పహల్గాం మృతులకు నివాళులు

తణుకు అర్బన్: జమ్మూకాశ్మీర్ పహల్గాం వద్ద ఇద్దరు విదేశీయులతో సహా 26 మంది పర్యాటకులను లష్కర్ తోయిబా ఉగ్రవాదులు కాల్చి చంపడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. బుధవారం పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో తణుకు రాష్ట్రపతి రోడ్డు సీపీఐ కార్యాలయం ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఉగ్రవాదులు చేస్తున్న దుశ్చర్యలను అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. పట్టపగలు అత్యంత దారుణంగా ఎలాంటి జంకు, బెరుకు లేకుండా అమాయక పర్యాటకులపై కాల్పులకు తెగబడడం ప్రభుత్వం నిఘా సంస్థల వైఫల్యమేనన్నారు. కేంద్రంలో బీజేపీ కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అంతమొందించాం, శాంతిభద్రతలు అదుపులోకి తెచ్చామంటూ గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ డొల్లతనం ఉగ్రదాడితో బయటపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, రాష్ట్ర సమితి సభ్యురాలు వై. నాగలక్ష్మి, సీపీఐ నాయకులు గార ప్రసాద్, అక్కిన నాగేశ్వరావు, దేవాని వెంకటరత్నం, కోరాడ నాగేంద్రబాబు, బొద్దాని కృష్ణకిషోర్, సారిపల్లి శ్రీరామ్, పాలాడి వెంకట్రావు, మజ్జి శ్రీనివాసరావు, వేంద్ర విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: మండలంలోని వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామానికి చెందిన ఇళ్ల ఆంజనేయులు ఈనెల 14న మద్యం సేవించి భార్యను కొట్టాడని, దీనిపై ఆయన ఇద్దరు కుమారులు తండ్రిని ఎందుకుకొట్టావని ప్రశ్నించారు. 15వ తేదీన ఉదయం ఆంజనేయులు పొలంలో కూరగాయలు కోసి తణుకు మార్కెట్‌కు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి వచ్చి అనంతరం మళ్లీ పొలం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని చెప్పారు. బంధువులు, చుట్టు పక్కల వెతకినా ఆచూకి లభించకపోవడంతో ఆయన కుమారుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

యలమంచిలి: గ్రామ దేవత మూలస్థానేశ్వరీ దేవి (ముంతాలమ్మ) అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం తాళ్లూరి శ్రీనివాస్ (వైజాగ్ బుజ్జి), శిరీష దంపతులు శంకుస్థాపన చేశారు. వీరితో అంబేద్కర్ కోనసీమ జిల్లా పెనికేరుకు చెందిన అర్చకులు ప్రసాద్‌శర్మ శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేయించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి వైజాగ్ బుజ్జి దంపతులు రూ.9 లక్షలు, తమ్మినీడి సర్వరాయ చక్రవర్తి దంపతులు రూ.9 లక్షలు, చిలుకూరి వెంకట ఫణి దుర్గా రామ్‌ప్రసాద్ దంపతులు రూ. 5 లక్షలు విరాళం ప్రకటించారు.